ఉద్యోగాలను కల్పించండి

■ కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్



నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. సంకల్ప, విశ్వకర్మ తదితర కార్యక్రమాలపై చర్చించి నైపుణ్య అభివృద్ధికి ప్రణాళిక తయారుచేయాలని సూచించారు. పీఎంకేవీవై ద్వారా ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చేలా సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిక్షణ తర్వాత జాబ్ మేళాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. ప్రతినెలా జాబ్ మేలా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని, ఎక్కడైనా సమస్య వస్తే తమకు తెలపాలని సూచించారు. వచ్చేవారంలో జాబ్ మేళా ఏర్పాటు చేయాలని, తాను వచ్చి పరిశీలిస్తానని అన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురం టౌన్

జ్వరం.. జ్వరం..



యాడికి ఆసుపత్రిలో కిక్కిరిసిన రోగులు

జ్వర పీడితులతో యాడికి ప్రభుత్వ వైద్యశాఖ శుక్రవారం కిక్కిరిసింది. ఒకే రోజు 170 మంది రోగులు ఓపీకి వచ్చారు. వీరిలో 80 మందికి పైగా జ్వరపీడితులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులు కూర్చునేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో అందరూ గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓపీకి వచ్చినవారిలో ఎక్కువగా దగ్గు, జలుబుతో బాధ పడేవారు ఉన్నారని డాక్టర్ శ్రీరామ్ కుమార్ అన్నారు. - యాడికి

ఈ ఎంఈఓ మాకొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈఓ హరికృష్ణ తనిఖీలకు వచ్చి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, హేళనగా మాట్లాడుతున్నారని ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తమకు వద్దని, వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ బెళుగుప్ప ఎన్టీఆర్ సర్కిల్‌లో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తహసీల్దారు షర్మిలకు ఫిర్యాదు చేశారు. ఎంఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూటీఎఫ్ నాయకుడు ఉప్పర శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకులు హేమంత్ నాయక్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. - బెళుగుప్ప

థ్యాంకూ రాజా.. వెల్లిరా..!



సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్న వైసీపీ నాయకులు

పామిడి సీఐ రాజశేఖర్ రెడ్డికి వైసీపీ నాయకులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను వీఆర్‌కు పంపించారు. దీంతో ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఆయన సేవలను కొనియాడారు. పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి.. షేక్ హ్యాండ్స్ ఇచ్చి మరీ అభిమానం చాటుకున్నారు. సాధారణంగా అధికారులు, అధికార పార్టీవారు ఇలాంటి స్వాగత, వీడ్కోలు కార్యక్రమాలను నిరాడంబరంగా నిర్వహించడం ఆనవాయితీ. కానీ పామిడి సీఐకి అధికారం కోల్పోయిన పార్టీవారు ఇలా ఘన సత్కారం చేసి వీడ్కోలు పలకడం టాక్ ఆఫ్ ది టౌన్ అయింది.

- పామిడి

వీళ్లకు బుద్ధి చెప్పేదెవరు?

జిల్లా విద్యాశాఖలో రచ్చ బజారుకు..

- దీఈఓకు బెదిరింపులు.. సోషల్ మీడియాలో పోస్టు
- వాట్సా్ప్‌కు ఎక్కిన ఎంఈఓల వివాదాలు
- బెళుగుప్పలో ఎంఈఓల మధ్య వివాదం
- విద్యాశాఖను కుదిపేస్తున్న కులరాజకీయాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: డీఈఓను బెదిరిస్తున్నారా..? విద్యాశాఖను కుల రాజకీయాలు శాసిస్తున్నాయా? కుల కుంపట్లు పెట్టుకున్న కొందరు ఎంఈఓలు వివాదాల్లో చిక్కుకుని రోడ్డుపైకి వచ్చారా...?, కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలు, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు, నిరసనలను చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. డీఈఓను కొందరు ఎంఈఓలు, మరి కొందరు వ్యక్తులు బెదిరిస్తున్నారని శుక్రవారం పెట్టిన ఓ పోస్టు వైరలైంది. బెళుగుప్పలో కొందరు ఉపాధ్యాయులు ఎంఈఓ-2పై చర్యలు తీసుకోవాలంటూ రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. దీని వెనుక కుల రాజకీయాలు ఉన్నాయన్న చర్చ ఉపాధ్యాయులు, విద్యాశాఖలో హాట్ హాట్‌గా నడుస్తోంది.

బెదిరింపులు నిజమా....?

జిల్లా విద్యాశాఖాధికారిగా వరలక్ష్మి పనిచేస్తున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి రీ ప్యాట్రియేషన్ అయిన మహిళా టీచర్‌కు పోస్టింగ్ కోసం ఆమెను ఆమెను ఒక ఎంఈఓ, మరికొందరు బెదిరించారని వాట్సప్‌లో పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. కుల సంఘాలను అడ్డు పెట్టుకుని ముందు కెళ్తున్న కొందరు ఎంఈఓలు, నాయకులు విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఆధిపత్యం కోసం పావులు కదుపుతున్నారని, ఉన్నతాధికారులను బెదిరించే స్థాయికి వెళ్లారన్నది అందులోని సారాంశం. గతంలో సమగ్రశిక్ష ప్రాజెక్టులో పని చేసిన ఏపీసీలను సైతం ఈ కోటరీ తమ పనుల కోసం బెదిరించిందని పోస్టు పెట్టారు. ఈ పోస్టు జిల్లా విద్యాశాఖను కుదిపేసింది. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు ఉండే వాట్సాప్ గ్రూపుల్లో ఈ పోస్టు చక్కర్లు కొట్టింది. శాఖపరమైన విచారణ జరిగితే వాస్తవాలు బయట పడతాయని అంటున్నారు.

రోడ్డెక్కిన ఎంఈఓల వ్యవహారం...

ఎంఈఓల మధ్య ఉన్న వివాదాలు, వ్యవహారాలు రోడ్డెక్కాయి. బెళుగుప్పలో ఇద్దరు ఎంఈఓల మధ్య, ఎంఈఓ టీచర్ల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఎంఈఓ-1 మల్లారెడ్డి, ఎంఈఓ-2 హరికృష్ణ మధ్య అంతర్గత విభేదాలున్నట్లు సమాచారం. ఎంఈఓ-2కు కొందరు ఉపాధ్యాయులకు మధ్య అంతరం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ఎంఈఓ-2 మండలంలోని ఓ స్కూల్‌కు తనిఖీకి వెళ్లడంతో టీచర్లు, ఆయన మధ్య జరిగిన సంభాషణ కొత్త సమస్యకు తెర లేపింది. ఈ ఘటనలోకి కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులూ తల దూర్చారు. ఆఖరికి శుక్రవారం ఉపాధ్యాయులు కొందరు బెళుగుప్ప తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. హరికృష్ణపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అయితే ఇటీవలే డీఈఓ బెళుగుప్ప మండల విద్యాశాఖ భేష్ అంటూ ఇద్దరు ఎంఈఓలు, మరో 9 మంది టీచర్లను ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేసి అవార్డులు ఇచ్చి సత్కరించారు. మరి ఇలాంటి ఘర్షణ వాతావరణం ఏర్పడేలా చేసిన కొందరికి పెద్దపీట వేస్తూ... మండలంలో 11 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం చూస్తుంటే దీని వెనుక పెద్ద వ్యవహారమే నడిచినట్లు తెలుస్తోంది. అవార్డుల్లో అక్రమార్కులు, కుల సంఘాల నేతల పెత్తనం వల్లే 10 మండలాలకు ఒక్కటీ ఇవ్వకుండా, కొన్ని మండలాలకే అవార్డుల్లో పెద్ద పీట వేశారని, ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఈనెల 5న ప్రత్యేక కథనంలో ప్రస్తావించింది. గత కొంత కాలంగా జిల్లా విద్యాశాఖ పరువు బజారున పడుతోంది. ఒక వైపు డీసీఈబీలో రూ.31.80 లక్షల వర్క్ డీఈఓకు తెలియకుండానే నకిలీ ఉత్తర్వులు సృష్టించి స్కాం చేసినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు ఎంఈఓలు కుల రాజకీయాలకు తెరతీసి, శాఖ పరువును బజారుకీడుస్తున్నారు. ఇంకో వైపు ఏకంగా డీఈఓపై బెదిరింపులకు దిగుతున్నారు. అయినా...జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు మౌనంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది.



బెళుగుప్పలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

డెంగీతో మహిళ మృతి



చంద్రకళ (ఫైల్)

కూడేరు మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన చంద్రకళ(31) డెంగీతో గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. పది రోజులుగా జ్వరంలో బాధపడుతుండటంతో ప్రైవేటు ఆస్పత్రులలో చూపించామని, ఆ తరువాత కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తన భార్య మృతి చెందిందని చంద్రకళ భర్త ఆంజనేయులు తెలిపారు. విషయం తెలుసుకున్న కూడేరు వైద్యాధికారి లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో కలిసి చంద్రకళ కుటుంబ సభ్యులతో వివరాలను సేకరించారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

- కూడేరు

కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జి



నాగేపల్లి వద్ద కూలిన హెచ్చెల్సీ బ్రిడ్జి

కణేకల్లు మండల పరిధిలోని నాగేపల్లి వద్ద ఉన్న హెచ్చెల్సీ బ్రిడ్జి శుక్రవారం మధ్యాహ్నం కూలిపోయింది. మాల్యం నుంచి గరుడచేడుకు వెళుతున్న ఓ రిగ్గు వాహనం హెచ్చెల్సీ 155 కి.మీ. వద్ద ఉన్న బ్రిడ్జిని దాటగానే అది ఒక్కసారిగా కూలిపోయింది. 1964లో నిర్మించిన ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వీటి మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. దీంతో పాత బ్రిడ్జిలు, కల్వర్టులు ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. ఏడాది క్రితం శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద ఉన్న బ్రిడ్జి కూలిపోయింది. అయినా కూడా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మాల్యం వద్ద మరో బ్రిడ్జి కూడా శిథిలావస్థలో ఉంది. అధికారులు స్పందించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కణేకల్లు

టమోటా కిలో రూ.30

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 2,550 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.24, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

- అనంతపురం రూరల్





యాడికిలో మొలకెత్తిన పచ్చజొన్న పంట

ప్రత్యామ్నాయమూ అంతే..!

ముందుకు సాగని ప్రత్యామ్నాయ పంటల సాగు...!

- తొలుత భారీ వర్షాలు.. ఆపై కురవక ఇబ్బందులు
- పలు ప్రాంతాల్లో పచ్చజొన్న, ఉలవ, కొర్ర సాగు
- విత్తనాల కోసం అరకొరగానే రిజిస్ట్రేషన్
- రబీ సీజన్‌లో పంటల సాగు కోసం నిరీక్షణ

జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగు ఆశించిన స్థాయిలో సాగడం లేదు. ఈనెలాఖరు దాకా ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అదును సమయం ఉంది. ఎర్రనేలల్లో పంటలు సాగు చేయడానికి రైతులు అన్ని పనులు పూర్తి చేసి, వాన కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని యాడికి మండలంలో పచ్చజొన్న, పెద్దవడుగూరు మండలంలో కొర్ర, పత్తి పంటలు సాగు చేశారు. మిగతా ప్రాంతాల్లో వర్షం వస్తే ఉలవ సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రస్తుతం పదును వర్షం పడే సూచనలు లేవని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగు కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనంతపురం అర్బన్

గత నెలలో భారీ వర్షం వల్లే..

జిల్లా వ్యాప్తంగా గత నెలలో 16నుంచి 20దాకా జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. భూమిలో తేమ శాతం అధికం కావడంతో అప్పట్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయలేకపోయారు. ఖరీఫ్ సీజన్‌లో కూడా వాన రాకపోవడంతో ఆశించిన స్థాయిలో ప్రధాన పంటలు సాగు చేయ లేదు. ఈనెలాఖరు దాకా నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. అక్టోబరు నుంచి ఈశాన్య రుతుపవన కాలం మొదలుకానుంది. అయితే వీటి ప్రభావంతో జిల్లాలో పెద్దగా వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈక్రమంలోనే అనేక మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదనే అభిప్రాయంతో వెనుకంజ వేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రబీ సీజన్ కోసం నల్లరేగడి భూముల రైతుల నిరీక్షణ

అక్టోబరు నుంచి రబీ సీజన్ ఆరంభం కానుంది. సాధారణంగా రబీ సీజన్ లో నల్లరేగడి భూముల్లో అత్యధికంగా పప్పుశనగ, ధనియాలు, తెల్ల కుసుమ, నువ్వుల పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం జొన్న, కొర్ర, ఉలవ, అలసంద వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే రబీ సీజన్‌లో అసలైన పంటలు పప్పుశనగ, ధనియాలు వంటి పంటలు సాగు చేయలే మన్న కారణంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయలేదని సమాచారం. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసిన తర్వాత కోత దశకు రావాలంటే 60 నుంచి 80 రోజుల సమయం పడుతుంది. ఈ పరిస్థితుల్లో నల్లరేగడి భూముల రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపడం లేదని తెలిసింది.

పచ్చ జొన్నలు విత్తేశా




రెండు వారాల కిందట నాలుగు ఎకరాల్లో పచ్చ జొన్న విత్తనం వేశా. విత్తనాలు బయట మార్కెట్‌లో కొనుగోలు చేశా. ప్రభుత్వం సబ్సిడీతో తెల్లజొన్నలు మాత్రమే పంపిణీ చేస్తోంది. అందులోనూ మా గ్రామానికి ఆలస్యంగా రెండు రోజుల కిందట సబ్సిడీ విత్తనం వచ్చిందంటున్నారు. ఇప్పుడు విత్తనం పంపిణీ చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదు.

- లక్ష్మీనారాయణ, పిన్నేపల్లి, యాడికి మండలం

అరకొరగానే రిజిస్ట్రేషన్

ఈ ఏడాది జిల్లాకు 27907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21791 క్వింటాళ్లు, పెసలు 1501, అలసంద 3253, జొన్న 973, కొర్ర 369, మినుములు 20 క్వింటాళ్లు ఉన్నాయి. ఆయా విత్తనాలకు 80 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. గత నెల 27 నుంచి రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం రైతుల పేర్ల నమోదు ప్రక్రియ మొదలు పెట్టారు. ఈనెల 5 నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీ ఆరంభించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో 6016 మంది రైతులు 1892 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా ఆయా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

వానొస్తే ఉలవ, జొన్న వేస్తా



నాకు పదెకరాల పొలం ఉంది. ఐదెకరాలు ఆముదం పంట వేశా. మరో ఐదెకరాల్లో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కలువ పడింది. ఉలవ, జొన్న సాగు కోసం సేద్యం పనులు చేసుకున్నా. మరో సారి పదును వర్షం పడితే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వం సబ్సిడీతో అందించే ఉలవ, జొన్నలతోపాటు బయట మరికొంత విత్తనం తెచ్చుకొని విత్తుకోవాలనుకుంటున్నా. వర్షం కోసమే ఎదురుచూస్తున్నా.

- మాధవరెడ్డి, ఆత్మకూరు

ఆశించినంతగా లేని ప్రత్యామ్నాయ పంటలు సాగు

ఈ సారి ప్రత్యామ్నాయ పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. గత నెలలో భారీ వర్షాల తర్వాత కంది, ఆముదం పంట సాగు చేసుకున్నారు. జొన్న, మొక్కజొన్న, అలసంద తదితర ప్రత్యామ్నాయ పంటలు పెద్దగా సాగు చేసుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లోని ఎర్రనేలల్లో ఉలవ పంట సాగుచేసుకుంటున్నారు. గత నెలలో వరుస భారీ వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో అప్పట్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయలేదు. ఆ తర్వాత కొద్ది రోజులకు విత్తనం వేద్దామంటే వర్షం పడలేదు. నల్లరేగడి భూముల్లో రబీ సీజన్‌లో పప్పుశనగ, ఇతర రకాల పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

- చంద్రాయుడు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

98 శాతం ఈ-పంట నమోదు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 8.30 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటి దాకా 8.18 లక్షల ఎకరాల్లో (98.7 శాతం) ఈ పంట నమోదు చేశారు. ఇంకా 11వేల ఎకరాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉంది. గత నెల మూడో తేదీ నుంచి రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఈ పంట నమోదును ప్రారంభించారు. తొలుత పది రోజులపాటు సర్వర్ సమస్యలతో ఈ పంట నమోదు ముందుకు సాగలేదు. దీంతో అప్పట్లో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఈనెల 15 దాకా ఈ పంట నమోదుకు గడువు విధించారు. ఇందుకు మరో రెండు రోజులే సమయం ఉంది. అప్పటిలోగా పెండింగ్‌లోని ప్రాంతాల్లో వంద శాతం ఈ పంట నమోదును పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మరోవైపు ఈ పంట నమోదు వివరాలు సర్వర్‌కు అప్‌లోడ్ చేసిన తర్వాత వీఏఏ అథెంటికేషన్ చేస్తారు. ఆ తర్వాత వీఆర్వో అంథెంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి దాకా రైతు సేవా కేంద్రం సిబ్బంది 7.87 లక్షల ఎకరాలకు అంథెంటికేషన్ చేశారు. ఇందులో 7.42 లక్షల ఎకరాలకు వీఆర్వోల అంథెంటికేషన్ (94.3 శాతం) పూర్తంది. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వో అథెంటికేషన్ తర్వాత రైతుతో ఈకేవైసీ చేయిస్తేనే ఈ పంట పూర్తవుతుంది. ఇప్పటి దాకా 2.51 లక్షల మంది రైతులతో (34 శాతం) ఈకేవైసీ వేయించారు. గడువులోగా ఈ పంట నమోదు పూర్తి చేసిన తర్వాత రైతులతో ఈకేవైసీని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ యంత్రాంగం పేర్కొంటోంది.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి



నూతన జిల్లా అధ్యక్షున్ని సత్కరిస్తున్న కోటా సత్యం..

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత తొలిసారి ఆయన డీసీసీ కార్యాలయానికి శుక్రవారం వచ్చారు. పలువురు పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. జిల్లాలోని నాయకులందరినీ కలుపుకుని పోతామని అన్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎదుర్కొంటామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కోటా సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఓనం పండుగకు ప్రత్యేక రైలు



గుంతకల్లు, సెప్టెంబరు 13: కేరళలో నిర్వహించనున్న ఓనం పండుగ సందర్భంగా కాచిగూడ-కొల్లాం మధ్య అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాచిగూడ-కొల్లాం (నెం. 07044) ప్రత్యేక రైలు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 11-20 గంటలకు కొల్లాంకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07045) 16వ తేదీన కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-45 గంటలకు కాచిగూడకు చేరుతుందని తెలిపారు. ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సీతి, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం రోడ్, కొట్టాయం, చెంగనసెరి, తిరువల, చెంగనూరు, మవెలికెర, కాయంకులం, కరునగపల్లి, శస్తంకొట్ట స్టేషన్ల మీదుగా కొల్లాంకు చేరుకుంటుందన్నారు.

పరుగుల వరద

525 పరుగులతో పటిష్ట స్థితిలో ఇండియా-సి జట్టు



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: దులీప్‌ట్రోఫీలో పరుగుల వరద పారుతోంది. అనంతపురంలోని అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు శుక్రవారం కొనసాగాయి. ఓవర్‌నైట్ స్కోర్ 288/8తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో రెండు పరుగులు మాత్రమే జోడించి ఆలౌట్ అయ్యింది. క్రీజులో ఉన్న షాంశ్ ములానీ 89పరుగులకు, అకీబ్‌ఖాన్ పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ దారి పట్టారు. ఖలీల్‌అహ్మద్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన ఇండియా డి జట్టు 183పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 పరుగుల ఆధిక్యం లభించింది. ఇండియా డి జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ డకౌట్ అయ్యాడు. జట్టులో దేవదత్ పడిక్కల్ మాత్రమే 92 పరుగులతో రాణించాడు. మిగతా బ్యాటర్లు ఆశించినమేరకు రాణించకపోవడంతో ఇండియా డి జట్టు 183 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇండియా-ఏ బౌలర్లు ఖలీల్ అహ్మద్, అకీబ్ ఖాన్ చెరో 3వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్‌కృష్ణ, తనుష్‌కొటియాన్, షాంశ్ ములానీ తలో వికెట్ పడగొట్టారు. రెండో రోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా ఏ 28.1ఓవర్లలో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 56 పరుగులకు ఔట్ కాగా, ప్రథమ్‌సింగ్ 59పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మొత్తంగా ఇండియా ఏ జట్టు 222పరుగుల ఆధిక్యంలో ఉంది.

పటిష్ట స్థితిలో ఇండియా-సి

దులీప్‌ట్రోఫీలో ఇండియా సి జట్టు 525 పరుగులతో పటిష్టస్థితిలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా సి జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 357/5తో రెండో రోజు ఆటను ప్రారంభించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 58, పరుగులు సాధించగా, మానవ్‌సుతార్ 156 బంతుల్లో 11బౌండరీలు, 3 సిక్సర్లతో 82 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అన్షుల్ కాంబోజ్ చివరిలో 38 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మొత్తంగా మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులకు ఇండియా సి జట్టు ఆలౌట్ అయ్యింది. ఇండియా బి బౌలర్లు ముకేష్‌కుమార్, రాహుల్ చాహర్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా బి జట్టు వికెట్ నష్టపోకుండా 36ఓవర్లలో 124పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్ 51, జగదీశన్ 67 పరుగులతో క్రీజులో ఉన్నారు.

క్రికెట్ అభిమానులకు పండగ

దులీప్‌ట్రోఫీలో బ్యాటర్లు తొలి రోజు నుంచే పరుగుల వరద పారిస్తూ క్రికెట్ అభిమానులను అలరిస్తున్నారు. రెండు మ్యాచ్‌లు జరుగుతుండగా నాలుగు జట్లలోనూ బ్యాటర్లు రాణిస్తున్నారు. ఇండియా-సి జట్టు 525 పరుగులు చేసింది. ఇండియా-బి జట్టు 124 పరుగులతో దీటుగా ఎదుర్కొంటోంది. ఇక ఇండియా-ఏ జట్టు 290పరుగులు చేయగా, ఇండియా డి జట్టు 183 పరుగులు చేసింది. ఆయా జట్లలో బ్యాటర్లు బ్యాట్‌తో ఝుళిపిస్తున్నారు. సిక్స్‌లు, బౌండరీలతో క్రికెట్ అభిమానులను అలరిస్తున్నారు. గ్యాలరీల్లో ప్రేక్షకులు నృత్యాలు చేస్తూ...కేరింతలు కొడుతున్నారు. డ్రమ్స్, ఈలలతో ప్లేయర్లను ప్రోత్సహిస్తున్నారు.



మయాంక్ అగర్వాల్



జగదీశన్



ఈశ్వరన్



దేవదత్ పడిక్కల్







మ్యాచ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు, క్రికెట్ అభిమానులు

రైతుకు మేలు జరగాలి

పంట నష్టపరిహారం, బీమా అందాలి

ఎమ్మెల్యే పరిటాల సునీత



వ్యవసాయశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ పంట నష్టపరిహారం, బీమా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ అధికారులు జిల్లాలో పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ ఖరీఫ్‌లో వర్షాభావంతో వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇలాంటి సమయం లో ప్రతి రైతుకూ ఈ-పంట నమోదు ముఖ్యమైనదన్నారు. పార్టీలకతీతంగా రైతులు సాగు చేసి ప్రతి పంటకు ఈ-పంట నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం 80 శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులను కోరారు.

ఆర్పీఎఫ్ డీఎస్‌సీ కార్యాలయం ప్రారంభం

గుంతకల్లు, సెప్టెంబరు 13: స్థానిక డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో నిర్మించిన రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయాన్ని డీఆర్ఎం విజయకుమార్ ప్రారంభించారు. డీఆర్ఎం కార్యాలయంలోని ఓ పాత భవనంలో ఆర్పీఎఫ్ డీఎస్‌సీ ఆఫీసు ఉండేది. రైల్వే డీఆర్ఎం కార్యాలయ పాత క్యాంటీన్ ప్రదేశంలో నూతనంగా ఆర్పీఎఫ్ డీఎస్‌సీ కార్యాలయాన్ని నిర్మించి, పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం డీఆర్ఎం ఆధ్వర్యంలో రిబ్బన్ కత్తిరించి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, డీఎస్‌సీ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్‌సీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీఆర్ఎం విజయకుమార్

డ్వామా పీడీ బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీఓ నంబరు 519 జారీ చేశారు. డ్వామా పీడీగా ఉన్న వేణుగోపాల్ రెడ్డిని తన మాతృశాఖ అయిన జైళ్ల శాఖకు డీఎస్పీగా బదిలీ చేశారు. మంగళవారం ఆయన రిలీవ్ కానున్నారు. అయితే ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 25టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సీఎల్ఐసీ పరీక్షా ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 13: సీఎల్ఐసీ-2024 పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం తెలిపారు. ఈ ఫలితాలను WWW.DSE.AP.GOV.IN వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అదేవిధంగా డమ్మి మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రేపు డిపార్ట్‌మెంటల్ పరీక్ష

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లాలో గ్రామీణ పశు సంవర్థక సహాయకులుగా ఉద్యోగం పొందిన 449 మందికి ఈనెల 15న డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉంటుందని ఆ శాఖ జేడీ వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ పూర్తయిందని, ఈనెల 15న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పరీక్ష హాల్‌లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు.

డీపీఓ గుమస్తాల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న గుమస్తాలను డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీ చేశారు. అందులో భాగంగా సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌ను ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయానికి, మరో సీనియర్ అసిస్టెంట్ స్వరూప్‌ను పెనుకొండ డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. వారి స్థానాల్లో పెనుకొండ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఉషారాణిని, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయం నుంచి లీలాబాయిని అనంతపురం డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామిని పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి, పుట్టపర్తి నుంచి జూనియర్ అసిస్టెంట్లు సాయి, నితీష్‌ను డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. పెనుకొండ నుంచి జూనియర్ అసిస్టెంట్ నిరంజన్‌ను పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

పిల్లోళ్లకు సెలవుల పండగ

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా స్కూళ్లకు మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారంతోపాటు మిలాడ్ ఉన్ నబి పర్వదినం సందర్భంగా సోమవారం కూడా సెలవు కావడంతో వరుస సెలవులు రానున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ స్కూళ్లకు సెలవు ప్రకటించారు. దీంతో ఆ సెలవును కవర్ చేయడానికి రెండో శనివారం (నేడు) వర్కింగ్ డే కింద స్కూళ్లు నిర్వహించాలని కొందరు కరస్పాండెంట్లు భావించారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే వర్కింగ్ డేగా ప్రకటించుకున్నారు. జిల్లాలో సెలవు ఇచ్చుకోవాలా..? స్కూళ్లు నడపాలా అన్న అంశంపై కరస్పాండెంట్లు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. సెలవుపై స్పష్టత ఇవ్వాల్సిన జిల్లా విద్యాశాఖాధికారులు సాయంత్రం వరకూ మౌనం వీడలేదు. సాయంత్రం దాటాక శనివారాన్ని సెలవుగా పరిగణించాలంటూ కరస్పాండెంట్లకు విద్యాశాఖ సమాచారం వెళ్లడంతో...సెలవుగా ప్రకటించుకున్నారు. దీంతో 14,15,16 మూడు రోజులూ వరుసగా సెలవులు రానున్నాయి.

డిగ్రీ గణిత శాస్త్రంలో ఆనర్స్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: డిగ్రీ గణితశాస్త్రంలో 4వ సంవత్సరం ఆనర్స్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి నాగశశికళ శుక్రవారం తెలిపారు. 2023-24లో బీఎస్సీ తృతీయ సంవత్సరం అభ్యసించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందన్నారు. ఆనర్స్ పూర్తి చేసిన విద్యార్థులు ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు పొందవచ్చు అన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010429089, 7702110277 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వైసీపీతో పంచాయతీరాజ్ నిర్వీర్యం

సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్

తాడిమర్రి, సెప్టెంబరు 13: రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన తాడిమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ సర్పంచుల అధికారాలను వైసీపీ ప్రభుత్వం కాలరాసిందన్నారు. 14,15 ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా చేసింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. ఆ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఉషశ్రీచరణ్ ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే పాత తప్పులను మరచిపోయి ఎదుటి వారిని విమర్శించడం దారుణమన్నారు. అప్పట్లో సర్పంచులకు ఏ అధికారం లేకుండా చేసి ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సర్పంచులను పనిచేయనీడంలేదని అనడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలలోపే రూ.800 కోట్లు సర్పంచుల ఖాతాలకు బదిలీ చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు.

సంచార జాతుల సంక్షేమానికి కృషి

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13: సంచార జాతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని గుంతకల్లప్ప కల్యాణ మండపంలో శుక్రవారం సంచార జాతుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంచార జాతుల వారు గ్రామీణ కళలు, ఇతిహాసాలు, రామాయణం, మహాభారతం, బుర్రకథలు, తోలుబొమ్మల ఆటల ద్వారా సంస్కృతిని కాపాడుతూ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సంచార జాతుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని చెప్పారు. వెంటకశివుడు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంచార జాతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారన్నారు. పాదయాత్రలో నారా లోకేష్ సంచారజాతుల కష్టాలు చూశాడని తెలిపారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవి, వై.శ్రీనివాసులు మాట్లాడుతూ తమకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కళాకారులకు పింఛన్లు, పక్కాగృహాలు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంచారజాతుల సంఘం జాతీయ కన్వీనర్ డి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు, సంచార జాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. కుళ్లాయప్ప, వివిధ సంఘాల నాయకులు ఇందిరాదేవి, జోగివెంకటేష్, ఎంకే రామాంజినేయులు, బండారు రామన్నచౌదరి, శేఖర్ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు, సంచారజాతుల సంఘం నాయకులు

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి

ఇరిగేషన్ సీఈకి జలసాధన సమితి వినతి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: ఉమ్మడి జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని జలసాధన సమితి నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో సీఈ నాగరాజును శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్ కుమార్, గంగిరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ వెడల్పు పనులు చేపట్టాలని, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 2.5లక్షల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరు అందించాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ నిర్మాణం, వెడల్పు, సామర్థ్యం పెంచాలన్నారు. హెచ్చెల్సీ ఆధునీకీకరణ పనులు చేపట్టాలని, పీఏబీఆర్‌ను 11టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యానికి పెంచాలని కోరారు. పెన్నా, చిత్రావతి, వేదవతి నదులపై డ్యాంలు నిర్మించాలన్నారు. టీబీ డ్యాం, శ్రీశైలం డ్యాంలలో వరద ఉన్నందున తుంగభద్ర, కృష్ణా జలాలను జిల్లాకు అధికంగా తీసుకుని రిజర్వాయర్లు, చెరువులన్నింటినీ నీటితో నింపాలన్నారు. దీనికి సీఈ స్పందిస్తూ...పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, రిజర్వాయర్లు, చెరువులను నీటితో నింపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు ఏసు, వీరనారప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న జలసాధన సమితి సభ్యులు

రేపు అపుస్మా సమావేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: నగర శివారులోని మాంటిస్సోరి ఎలైట్‌లో ఈ నెల 15న అపుస్మా జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఆ సంఘం నాయకులు తెలిపారు. కమలానగర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ ముఖ్య సలహాదారులు శేఖర్‌రావు, పరంజ్యోతి చేత ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లకు మోటివేషన్ క్లాసులు ఈ నెల 15న నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు పుల్లారెడ్డి తెలిపారు. అదే రోజున జిల్లా సర్వసభ్య సమావేశం కూడా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాలకు అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ నాగరాజు, నాయకులు శశిభూషణ్, సూర్యనారాయణరెడ్డి, రవిశంకర్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశమైన నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం: మంత్రి సవిత

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలతో మంత్రి సవిత

హిందూపురం, సెప్టెంబరు 13: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మార్కెండేయనగర్‌లోని ఎస్‌పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీలో సబ్ జూనియర్ అండర్-15 విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి పోటీలు ప్రారంభమై శుక్రవారం ముగిసాయి. పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మంత్రి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు క్రీడాకారులకు ఉంటాయన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు భవిష్యత్తులో ఉద్యోగాలు పొందడానికి దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనంతపురం బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అంకమ్మ చౌదరి, సంయుక్త కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, డాక్టర్ వెంకటేశ్, పద్మావతి, అసోసియేషన్ సభ్యులు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ పరీక్షల ఫలితాలను శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూలైలో బీటెక్ తృతీయ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు మూడు, నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సెమిస్టర్(ఆర్17,21) సప్లిమెంటరీ. ఎంఫార్మసీ ప్రథమ, తృతీయ సెమిస్టర్(ఆర్17,21) సప్లిమెంటరీ. ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, (ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ఏపీ శివకుమార్, ఏసీలు శంకర్ శేఖర్, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు

సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలని కొనసాగిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదురుగా, మల్లు స్వరాజ్యం నగర్, శ్రీశ్రీ నగర్, నగరపాలక సంస్థ కార్మిక సంఘం, ఆటో కార్మిక సంఘం, రంగస్వామి నగర్ తదితర ప్రాంతాల్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలి, రాజు, వెంకటేష్, గఫూర్, టీయన్ రసూల్, కుమార్, హరి, రాఘవ, నాగేశ్వరరావు, ముసలప్ప, రాముడు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మినీ లెదర్ పరిశ్రమను ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే



రాచేపల్లి మినీ లెదర్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 13: మినీ లెదర్ పరిశ్రమను ప్రారంభించి దళిత కుటుంబాల్లోని యవతకు ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం శింగనమల మండలంలోని రాచేపల్లి వద్ద మూతపడ్డ మినీ లెదర్ పరిశ్రమను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట పరిశ్రమను మూత వేశారని, గతంలో ఉన్న ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ పరిశ్రమను ప్రారంభిస్తామన్న హామీని గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం దళితుల పట్ల చిత్తశుద్ధితో ఉందని పరిశ్రమను తిరిగి ప్రారంభించి దళిత యవతకు ఉపాధి చూపుతామన్నారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆర్డీఓ వసంతబాబు, పరిశ్రమల శాఖ మేనేజర్ నాగస్వామి తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, తెలుగుయవత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, చితంబరిదొర, ఈశ్వర్‌రెడ్డి, చిదానందనాయుడు, చంద్రాయుడు, విశ్వనాథ్, రవీంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న సిమెంట్ పోలన్న

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితులకు అనంత ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సిమెంట్ పోలన్న రూ.2.16 లక్షలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేశారు. ఆయనను సీఎం అభినందించారు. సత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జరిపిటి కృష్ణమూర్తి, నాయకుడు పుల్లన్న పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో...



జేసీకి చెక్కును అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అనంతపురం టౌన్: విజయవాడ వరద బాధితుల సాయంకోసం ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆర్థికసాయం చేశారు. ఏడురోజులు పాటు వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.65,123 ఏపీ సీఎంఆర్ఎఫ్ పేరిట డీడీతీసి శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అక్కడ కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మను కలిసి ఆ డీడీని అందించారు. వలంటీర్లను జేసీ అభినందించారు. ప్రోగాం ఆఫీసర్ శ్రీధర్, వలంటీర్లు సాయి, నవీన్, శ్రీలత, పురుషోత్తం, సోనియా పాల్గొన్నారు.

ఎస్కేయూ ఉద్యోగుల సాయం



వీసీ అనితను కలిసి అంగీకారపత్రాన్ని అందజేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అనంతపురం సెంట్రల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎస్కేయూ ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాను కలిసిన ఉద్యోగులు విరాళ అంగీకారాన్ని అందజేశారు. అనంతరం వీసీ అనిత మాట్లాడుతూ వర్సిటీ టైంస్కేల్ సిబ్బంది 125మంది, ఇంజనీరింగ్ కళాశాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 36మంది వరద బాధితులకు సహాయాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. వారికి సబంధించిన ఒకరోజు మూలవేతనం నుంచి దాదాపు రూ.1.75లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమచేయనున్నట్లు తెలిపారు.

తైక్వాండోలో విద్యార్థికి కాంస్య పతకం



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: మాంటిస్సోరి విద్యాసంస్థల విద్యార్థి తైక్వాండో పోటీల్లో జాతీయస్థాయి పతకం సాధించినట్లు కరస్పాండెంట్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పృథ్వీ తారక్‌రెడ్డిని శుక్రవారం యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. కరస్పాండెంట్ మాట్లాడుతూ తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఆగ్రాలో సబ్ జూనియర్ అండర్-35 కేజీల బాలుర విభాగం పోటీలు నిర్వహించిందన్నారు. పృథ్వీ అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించాడన్నారు. విద్యార్థిని స్కూల్ యాజమాన్యం నగదు బహుమానం అందించి, మరిన్ని పతకాలు సాధించి, జిల్లాకు, రాష్ట్రానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 13: పంటల సాగులో రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అనంత ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేనేజర్లు, ఏఈఓలకు పొలంబడిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవడంతోపాటు నాణ్యమైన దిగబడిని పొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కమిషనరేట్ వ్యవసాయ అధికారి లక్ష్మీరెడ్డి, విత్తన ధ్రువీకరణ అధికారి రవి, సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 13: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ సంతోష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌషికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పీడీ మాట్లాడు తూ గర్భిణులు, బాలింతలు అంగన్ వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పకతీసుకోవాలన్నా రు. సీడీపీఓ ధనలక్ష్మి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సూ పర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చీరల వ్యాపారి మృతి

బత్తలపల్లి, సెప్టెంబరు 13 : మండలంలోని నల్లబోయనపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చీరల వ్యాపారి మరణించాడు. అనంతపురానికి చెందిన ఆంజనేయులు కుమారులు పవన్ (27), ఈశ్వర్. వీరు చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఎప్పటిలాగే శుక్రవారం ద్విచక్ర వాహనంలో చీరలు వేసుకొని అనంతపురం నుంచి కదిరి వైపు బయలుదేరారు. నల్లబోయనపల్లి వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మరణించాడు. ఈశ్వర్ గాయపడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది. పవన్‌కు భార్య స్వాతి, కుమార్తె ఉన్నారు.

ఫారంపాండ్లను సద్వినియోగం చేసుకోవాలి

● అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

రాప్తాడు, సెప్టెంబరు 13: భూగర్భ జలాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫారంపాండ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. కూటమి ప్రభుత్వం అధికరంలోకి వచ్చాక జిల్లాలో మొదటిసారిగా రాప్తాడు మండలం హంపాపురం, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి గ్రామాల్లో ఫారంపాండ్లు మంజూరయ్యాయి. డ్వామా ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ పథకం కింద రూ.2.80 కోట్ల విలువ చేసే ఫారంపాండ్లు, చిన్న నీటి కుంటలు, చెక్ డ్యాంలు మంజూరయ్యాయి. ఈ పనులకు శుక్రవారం పరిటాల సునీత భూమి చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్లు తవ్వితే స్థలం వృథా అవుతుందని ఆలోచిస్తే భవిష్యత్తులో నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ఫారంపాండ్లతో వర్షపు నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మేలు చేసే పథకాలు ఏవీ చేయలేదన్నారు. ఏపీడీ సుధాకర్‌రెడ్డి, అనురాధ, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య, ఎంపీటీసీ జాఫర్, హంపాపురం జయప్ప, నంబూరి రమణ, సాకే జయరాముడు, మరూరు గోపాల్, నంబూరి ప్రతాప్, డీలర్లు పార్థసారథి, మహమ్మద్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు మధు, ఉజ్జినేశ్వర పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వాటర్‌షెడ్ చైర్మన్ల ఎంపిక: మండలంలోని గొందిరెడ్డిపల్లి, హంపాపురం, రామినేపల్లి గ్రామాల వాటర్‌షెడ్ చైర్మన్లను ఎంపిక చేశారు. గొందిరెడ్డిపల్లి మల్లికార్జున, హంపాపురం యోగి, రామినేపల్లి పోతులయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే పరిటాల సునీత చైర్మన్లుగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందచేసి అభినందించారు.

డ్రైనేజీలు శుభ్రం చేయకపోతే ఎలా..?

● శానిటేషన్ అధికారులపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 13: డ్రైనేజీలు శుభ్రం చేయకపోతే ఎలా..? అంటూ నగర పాలక సంస్థ శానిటేషన్ అధికారులపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అంబేడ్కర్ నగర్‌లో మురుగుకాలువలు నిండి, రోడ్డుపై రావడంతో స్థానికులు ఎమ్మెల్యేకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన వెంటనే స్పందించారు. నగరపాలక సంస్థ శానిటేషన్ అధికారికి ఫోన్‌చేసి సిబ్బందిని పంపించి మురుగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సిబ్బంది కాలువలను శుభ్రం చేశారు. తన వరకు ఫిర్యాదులు వస్తున్నాయంటే.. మీరు క్షేత్రస్థాయిలో ఏం పనులు చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్లపై డ్రైనేజీ నీరు పారడం ద్వారా విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

జేవీవీ మహాసభలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 13: జిల్లాకేంద్రంలోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న జన విజ్ఞాన వేదిక(జేవీవీ) వార్షిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. 14న ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ మాజీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ ముఖ్యఅతిథిగా హాజరై మహాసభలను ప్రారంభిస్తారన్నారు. అదేరోజు శాస్త్రీయ దృక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. తనతోపాటు మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, సంఘం గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఉపన్యసిస్తారన్నారు. 15న 'రాష్ట్ర అభివృద్ధి - ప్రతిపాదనలు' అనే అంశంపై సదస్సు, 'శాస్త్ర ప్రచారంలో యువతరం, మహిళల పాత్ర' అనే అంశంపై ప్రత్యేక సభ నిర్వహిస్తామన్నారు. 26 జిల్లాల నుచిఇ ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు, కార్యకర్తలు, మేధావులు విరివిగా పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

అనంతపురంరూరల్, సెప్టెంబరు 13: మండలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా రూ.13.72కోట్ల పనులు జరిగిన పనులపై ప్రోసీడింగ్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి సామాజిక తనిఖీ చేపట్టారు. రోడ్లు, సచివాలయం, హెల్త్ క్లినిక్‌లు, ఫారంపాండ్లు, అవెన్యూప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించిన వాటిపై విచారించారు. అవెన్యూప్లాంటేషన్‌లో మొక్కలు నాటడంలో జరిగిన తప్పిదాలపై సంబంధిత అధికారులకు సిబ్బందికి రూ.22వేలు చెల్లించాలని ఆదేశించారు. ఏపీడీ అనురాధ, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీఓ పుల్లయ్య, పీఆర్‌జేఈ శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, ఏపీఓ చంద్రకళ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని త్వరతగతిన అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్ కోరారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప అధ్యక్షతన రోడ్లు, భవనాల అతిథిగృహంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారి రాజకీయ జీవితంలో ఎస్సీల జీవన స్థితిగతులను మార్చేలా వర్గీకరణ అంశాన్ని ఆమోదించడం శుభపరిణామమన్నారు. నాయకులు లక్ష్మణమూర్తి, సురేష్‌బాబు, రాజు, వన్నూరుస్వామి, ఎల్లప్ప, తిప్పన్న, నారాయణ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శింగనమల సెప్టెంబరు13: మండలంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ పోలీసుల బృందం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టుచేసి వారి నుంచి రూ.9100, 5 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళా హోంగార్డుకు ఆర్థిక సాయం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13: జిల్లాలోని తాడిపత్రిలో హోంగార్డుగా పనిచేస్తూ పదవీ విరమణ చెందిన వెంకటసుబ్బమ్మకు ఎస్పీ జగదీష్ రూ.4,39,200 చెక్కును అందజేశారు. జిల్లా హోంగార్డులు ఒక రోజు వేతనంలో ఈ మొత్తాన్ని ఇచ్చారు. హోంగార్డులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ రమణమూర్తి, ఆర్ఐ మధు పాల్గొన్నారు.

హత్య కేసులో రిమాండ్

రెండు రోజుల క్రితం నవోదయకాలనీ ప్రధాన రహదారిలో జరిగిన హత్య కేసులో నిందితుడు తేజను వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గణేష్ నిమజ్జనం రోజు రాత్రి దేవరకొండ శ్రీధర్‌ను బీరు బాటిల్ పగలకొట్టాడనే కారణంతో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితున్ని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నవడుగూరుకు చెందిన వీరాంజనేయులు సుశీల్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్నాడు. శుక్రవారం టీవీ టవర్ సమీపంలో బైక్ యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 13: ఇంటి నుంచి అదృశ్యమైన ఓ వ్యక్తి ఆత్మహ త్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చెన్నేకొత్తపల్లి ఎస్సీకాలనీకి చెందిన నరసింహులు(50) 9వ తేదీన అదృశ్యమైనట్లు ఆయన భార్య నారాయణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నేకొత్తపల్లి సమీపంలో ఐదు రోజుల తరువాత కోనకు వెళ్లే దారి అటవీప్రాంతంలో ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకున్నాడు. గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా నరసింహులు అనారోగ్యంతో బాధపడుతుండేవాడని పోలీసులు తెలిపారు. నరసింహులుకు భార్య నారాయణమ్మతోపాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలు చేశారు. బెళుగుప్ప మండలం గుండ్లపల్లి ప్రభావతికి చెందిన రేషన్ షాపు, కాలువపల్లిలోని సుధాకర్‌కు చెందిన రేషన్ షాపులో తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వలను పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన నిలువలు కంటే అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని జప్తుచేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న ట్లు సీఐ జమాల్‌బాషా తెలిపారు. తనిఖీలో ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్, వీఆర్వో నాగేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఎమ్మెల్యే ఆపన్నహస్తం

గార్లదిన్నె, సెప్టెంబరు 13: బాలుడి వైద్యానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆపన్నహస్తం అందించారు. మండలంలోని పాతకల్లూరుకు చెందిన కొండమల్లెల సుజాత, నరేంద్ర దంపతులకు 6 సంవత్సరాల కుమరుడు శ్రీకాంత్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లగా వైద్యులు బాలుడి జబ్బు నయం కావడానికి రూ.17 లక్షలు ఖర్చవుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో కుమారుడి వైద్య కోసం అంత డబ్బు తమ వద్దలేదని శుక్రవారం కొందరు దళిత నాయకులతో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని ఆశ్రయించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి ఆట్లాడారు. ఆందోళన చెందవద్దని మీకు అండగా నేనుంటానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం కొంత ఆర్థికసాయం అందించారు.

యూటీఎఫ్ నాయకుల బెదిరింపులు హేయం

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: యూనియన్ సభ్యత్వం కోసం ఆ సంఘం నాయకులు తెలుగు పండిట్‌ను బెదిరించడం హేయమని రాష్ట్రీ ఉపాధ్యాయ పండిత పరిషత్(ఆర్‌యూపీపీ) నాయకులు ఖండించారు. సంఘం జిల్లా అధ్యక్షులు హనుమేష్, సహాధ్యక్షులు ఎర్రిస్వామి, ప్రధానకార్యదర్శి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో యూటీఎఫ్ నేతల వైఖరి అసహనం వ్యక్తం చేశారు. మార్కాపురం మండలంలోని స్థానికవరం జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ యూనియన్ సభ్యత్వం కోసం వెళ్లిన నాయకులు ఓ మహిళా తెలుగు పండిట్‌పై పిల్లల సమక్షంలో అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 13: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తెలిపారు. టౌన్-1 పరిధిలోని ఆదిమూర్తి నగర్, గుల్జార్‌పేట, సుభాష్‌రోడ్డు, హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్, ఆదర్శనగర్, లక్ష్మీనరసయ్య కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, టౌన్-2 పరిధిలోని తపోవనం, సోమనాథనగర్, నవయుగ కాలనీ, రాయల్‌నగర్, వేణుగోపాల్‌నగర్, నీరుగంటి వీధి, శ్రీనగర్‌కాలనీ, రాంనగర్, 80 అడుగులరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: జిల్లాలో శనివారం నుంచి 15 రోజుల పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహీ హీ సేవా కార్యక్రమం మొదలవుతున్నట్లు డీపీఓ ప్రభాకర్‌రావు శుక్రవారం తెలిపారు. 14న ప్రారంభమై అక్టోబర్ 1 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఏమి చేయాలన్నది దిశా నిర్దేశం చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

● కలెక్టరేట్ ముందు తాగునీటి కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: బకాయి వేతనాలు, పీఎఫ్, చెల్లించి సత్యసాయి వాటర్ సప్లయ్ పథకాన్ని కాపాడాలని కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సత్యసాయి బోర్డు కార్యాలయంలో ఎస్ఈ ఎహసాన్ బాషా ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు అధికారులతో చర్చలు జరిపారు. కార్మిక సంఘం నాయకులు పలు డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. అధికారులు గతంలో చెప్పిన మాటలే మా పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తామని, మిగిలినవి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పుకొచ్చారు. దీంతో కార్మిక సంఘం నాయకులు సమ్మతించలేదు. కార్మిక సంఘం నాయకులు సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. అధికారుల నుంచి శుక్రవారం జరిపిన చర్చల్లో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. కార్మికులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరయ్య, శ్రీనివాసులు నాయకులు తిప్పేస్వామి, మధు, శ్రీరాములు, ప్రసాద్, వన్నూరప్ప, లక్ష్మీరెడ్డి, వీరాంజనేయులు, బాలకృష్ణ, బాబయ్య, రమేష్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకోవాలి

● జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను పెంచుకోవాలని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మమత అధ్యక్షతన నిర్వహించిన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పనిఒత్తిడి, ఆహారపు అలవాట్లు అనారోగ్యానికి గురిచేస్తాయన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే భౌతికంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రొఫెసర్ శశిధర్, జోజిరెడ్డి, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.

కొనసాగిన స్టాఫ్‌నర్సుల ఆందోళన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 13: తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల ఆందోళన కొనసాగించారు. ఐదో రోజు జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేయాలని, జీఓ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల సంఘం నాయకురాళ్లు పద్మలత, శ్రీదేవి, కళావతి, శోభ, అనితతో పాటు ఆస్పత్రిలో పనిచేసే నర్సులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం

నార్పల, సెప్టెంబరు 13: నార్పల ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసులో మహిళా నెట్‌వర్క్, మండల సమైక్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి పీహెచ్‌సీ డాక్టర్ సదియా, వైద్యసిబ్బంది హాజరయ్యారు. 22 గ్రామాల నుంచి 52 మంది దివ్యాంగులు చికిత్సకు వచ్చారు. ఇద్దరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ అక్కులప్ప మాట్లాడుతూ దివ్యాంగులు పరిశుభ్రంగా ఉండాలని, వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆర్డీటీ ఎస్‌టీఎల్ క్రిష్ణయ్య, జీఓ శ్రీనివాసులు, మహిళా నెట్‌వర్క్ కమిటీ సభ్యులు అరుణమ్మ, కుమారి, నాగేశ్వరి, లక్ష్మీదేవి, మండల సమైఖ్య అధ్యక్షురాలు అమీర్, కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి గంగానాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు/గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13: పట్టణంలోని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ డీఈఈ రంగస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌యార్డు, ఆలూరురోడ్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆదర్శనగర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా థైరాయిడ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సరోజమ్మ మాట్లాడుతూ.. చదువును నిర్లక్ష్యం చేయరాదని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తర్వాత విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలు చేశారు. అనంతరం కళాశాల అభివృద్ధికి వైద్యురాలు సరోజమ్మ రూ.లక్ష ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, మహిళాసాధికారత సమితి అధ్యక్షురాలు వాణిశ్రీ, అభయ విద్యానిధి ఛైర్‌పర్సన్ వసుంధర, ఇన్నర్ వీల్, రోటరీ క్లబ్ అధ్యక్షులు, సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, సెప్టెంబరు 13: మండలంలోని బేతాపల్లి గ్రామంలో చిన్నఓబన్న అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బేతాపల్లికి చెందిన చిన్న ఓబన్న గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని, ఈ క్రమంలో మనస్థాపం చెందిన ఆయన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని బంధువులు తెలిపారు. అపస్మారకస్థితిలో పడి ఉన్న కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని, తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారని చెప్పారు. సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎఫ్‌పీ షాపుల తనిఖీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా బెలుగుప్ప మండలం గుండ్లపల్లిలో ప్రభావతికి చెందిన రేషన్ షాపును, అదే మండలం కాలువపల్లిలోని సుధాకర్‌కు చెందిన రేషన్ షాపును తనిఖీ చేసి రికార్డులు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. రికార్డుల కంటే నిల్వలు అధికంగా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తర్వాత నిల్వలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ జమాల్‌బాషా తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ ఫణీంద్రనాథ్ రెడ్డి, ఏఓ వాసు ప్రకాష్, డీసీటీఓ సురేష్, వీఆర్వో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

పామిడి, సెప్టెంబరు 13: మండలకేంద్రంలోని పెన్నానదితో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని వాగులు, వంకలు, చెరువులు, కుంటల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీధరమూర్తి శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ. 5వేలు, టిప్పర్‌కు రూ. 25వేలు, ఎద్దులబండికి రూ. 2వేలు జరిమానా విధిస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసుశాఖ సమన్వయంతో కృషి చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 13: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, రంగచేడు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను రాయంపల్లి గేటు వద్ద, మద్దానేశ్వరస్వామి టెంపుల్ వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అనంతపురం క్రైం,సెప్టెంబరు 13 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన వీరాంజనేయులు నగరంలోని సుశీల్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్నాడు. కాగా శుక్రవారం టీవీ టవర్ సమీపంలో బైక్ యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లు, సెప్టెంబరు13: పట్టణంలో తాగునీటి సరఫరా కోసం రూ. 27 లక్షల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని 5, 7, 12వ వార్డుల్లో పైప్‌లైన్ల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో సత్వర చర్యల్లో భాగంగా ఈ పనులను చేపట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, అంజి, శివన్న , సర్పంచు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి విగ్రహ ఏర్పాటుకు పూజలు

రాయదుర్గంటౌన్, సెప్టెంబరు 13: పట్టణంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వహణాధికారి నల్లపూల వెంకటేశులు తెలిపారు. అమ్మవారి విగ్రహ తయారీ బాధ్యతలను అయోధ్య రామ్‌లల్లా శిల్పి అరుణ్‌యోగిరాజ్‌కు అప్పగించామన్నారు. దీంతో శుక్రవారం ఆ శిల్పి సమక్షంలో రాయికి పూజలు నిర్వహించామన్నారు. అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు పట్టణ ప్రముఖులు కరుణేష్ రూ. 1.20 లక్షలు, శెట్టి రామచంద్రప్ప రూ. లక్ష, మధు రూ. లక్ష, లలిత రూ.లక్ష, భీమల్‌కుమార్ రూ. 50 వేలు విరాళం ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో అన్నపూర్ణ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు.

న్యాయం చేయండి

గుంతకల్లు, సెప్టెంబరు 13: ఉన్నతాధికారుల వేధింపులకు బలైపోయిన రైల్వే ఉద్యోగిని నాగలక్ష్మి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఉదయం డీఆర్‌ఎం విజయకుమార్‌ను కలిసి మాట్లాడారు. తనకు ఇబ్బందులు ఎదురయ్యే చోటకు బదిలీ చెయ్యవద్దంటూ మొరపెట్టుకున్నా ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టడంతో ఉద్యోగిని నాగలక్ష్మి గత ఆగస్టులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. బాధ్యులైన రైల్వే అధికారులు సుధాకర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడంలో తాత్సారం జరుగుతోందన్నారు. దళిత ఉద్యోగినికి జరిగిన అన్యాయంపై సత్వరమే స్పందించాలన్నారు. మృతురాలి తల్లికి సెటిల్మెంట్లు ఇవ్వాలని, ఆమె సోదరుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని డీఆర్‌ఎంను కోరారు. నాయకులు సాకే హరి, ఎం ఓబులేసు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

● కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరుజయరాం

గుత్తి, సెప్టెంబరు 13: గత ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటామన్నారు. పార్టీ విజయానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విజయవాడ వరద బాధితుల సహాయార్థం ధాన్యం సేకరణ చేపట్టిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎంకే చౌదరి

టీడీపీ గుత్తి పట్టణ అధ్యక్షుడిగా ఎంకే చౌదరిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం అనంతరం ఎంకే చౌదరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంకే చౌదరికి, ఎమ్మెల్యేకి, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణకు స్థానిక నాయకులు, కార్యకర్తలు శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. నాయకులు ప్రతాప్, కరిడికొండ సూరి, చిన్నరెడ్డియాదవ్, చికెన్ శీనా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లికి 958 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 13 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 958 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 864 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి, సెప్టెంబరు 13: పట్టణంలోని రంగప్పకాలనీలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ ప్రజా ఉద్యమనేత సీతారాం ఏచూరి అన్నారు. ఎస్ఎఫ్ఐలో చేరి వామపక్ష భావజాలంతో పనిచేస్తూ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. 1985లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం ప్రజా బలంతో చట్టసభల్లో గొప్ప పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరంగయ్య, కృష్ణమాచారి, ఎర్రప్ప, మద్దిలేటి, లోకేష్, రామలక్షుమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పేదల పక్షాన నిలిచి చివరి శ్వాస వరకు పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున , నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, కృష్ణనాయక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

పామిడి, సెప్టెంబరు 13: విజయవాడలో వరదబాధితుల ఆదుకునేందుకు గాను పామిడి మండల ప్రజలు నిత్యావసర సరుకుల్ని, దుస్తుల్ని అందజేశారు. వాటిని మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రత్యేక వాహనంలో విజయవాడకు జెండా ఊపి తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వరదబాధితుల్ని ఆదుకునేందుకు మండల ప్రజలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మండల ప్రజలు రూ. లక్ష నగదుతో పాటు దాదాపు 500 క్వింటాళ్ల బియ్యం, వంటనూనె, దుస్తులు అందజేశారన్నారు. అలాగే తాను 5 లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, నాయకులు దాసరి లక్ష్మీకాంతమ్మ, బొల్లు శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: విజయవాడ వరదబాధితుల సహాయం కోసం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టినట్లు నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, ప్రజల నుంచి విరాళాలు సేకరించామన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంత విరాళం అందించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, నారాయణరెడ్డి, చిన్నకుళ్లాయప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు బియ్యం, దుస్తులను సేకరించి ఏఐఎస్ఎఫ్, సీపీఐ, ఏఐవైఎఫ్ జిల్లా కమిటీకి అందజేశారు. ఒక క్వింటా బియ్యంతో పాటు దుస్తులను అందించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు జయప్రద, సామ్రాజ్యలక్ష్మి, వెంకటనారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చల్లా సుబ్బరాయుడికి ఘన నివాళి


చల్లా సుబ్బరాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, సెప్టెంబరు 13: దివంగత మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని యల్లనూరురోడ్డు సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడిపత్రికి చెందిన తొలితరం రాజకీయ నాయకుల్లో చల్లా సుబ్బరాయుడు ఒకరన్నారు. ఆయన ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన పేరుపై సుబ్బరాయసాగర్ ప్రాజెక్ట్ నిర్మించడం ఆనందదాయకమన్నారు. నివాళులర్పించిన వారిలో చల్లా సుబ్బరాయుడు కుమార్తె అమృత, జంబులపాడు సర్పంచు ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు తమ్మినేని ప్రసాద్‌నాయుడు, నరసింహులు, సత్యనారాయణ, చింబిలి ప్రసాద్, నరేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

విడపనకల్లు, సెప్టెంబరు 13: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రధానోపాధ్యాయుల సూచించారు. మండలంలోని గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో విడపనకల్లు ఆదర్శ పాఠశాల, కేజీబీవీతో పాటు కరకముక్కల, పాల్తూరు, హావళగి, పెద్దకొట్టాల పల్లి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. తర్వాత కబడ్డీ, కోకో, హైజంప్, లాంగ్ జంప్, 100మీటర్ల పరుగుపందెం, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు, పాఠశాలల కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

17న మండలస్థాయి స్కూల్ గేమ్స్

యాడికి: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఈనెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓ కాశప్ప, మండల కోఆర్డినేటర్ ఓబులమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడాపోటీల్లో మండలస్థాయిలో బాలికలు, బాలుర ఎంపికలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎంల చేత జారీ చేయబడిన పుట్టినతేదీతో కూడిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని యాడికి హైస్కూల్ మైదానంలో హాజరుకావాలని సూచించారు.

మల్లేశ్వరస్వామి సేవలో హోంమంత్రి ఓఎస్డీ


ఆలయం వద్ద ఓఎస్‌డీ అనిల్ పులిపాటి తదితరులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 13: కంబదూరు మల్లేశ్వర స్వామి ఆలయాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ఓఎస్డీ అనిల్ పులిపాటి దంపతులు శుక్రవారం సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి దర్శనాన్ని చేయించి పూజలు జరిపారు. త ర్వాత ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు అనిల్ పులిపాటి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గతంలో అనిల్ పులిపాటి కళ్యాణదుర్గం డీఎస్పీగా పనిచేశారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 13: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్‌గా ఉషారాణి బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే ఈమె ఇక్కడికి వచ్చారు.

విద్యార్థుల ప్రతిభ

కూడేరు, సెప్టెంబరు 13: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండలంలోని పి. నారాయణపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ముంబయ్‌కు చెందిన రంగోత్సవ వేడుకల సంస్థ కలరింగ్, చేతి రాత, కార్టూన్ వేయడం, మేకింగ్, టాటూ మేకింగ్, స్కెచ్చింగ్, గ్రీటింగ్ కార్డ్ తయారీ పోటీలు నిర్వహించింది. కూడేరులో విద్యార్థులు ప్రతిభ చూపి 8 మంది బంగారం పతకాలు, 8 మంది వెండి పతకాలు, 8మంది, కాస్య పతకాలు. మరో నలుగురు ట్రోఫీలు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పి. నారాయణపురం విద్యార్థులు కూడా ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 13 : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలువల్లో ఉన్న దోమ లార్వాలను నిర్మూలించడానికి వేస్ట్ ఆయిల్ ఇసుకలో కలిపి చల్లాలని ఆశావర్కర్లకు తెలియజేశారు. నీటిని కాచి చల్లార్చుకుని తాగాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలను ఉంచకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్ర పాటించాలని కోరారు. సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను పారబోయించారు. ఇళ్లల్లో నీటిని వారం రోజుల పాటు నిల్వ ఉంచకూడదని, వారానికి ఒకరోజు ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల వృద్ధి కాకుండా మురికి నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని తెలిపారు. దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు ఎన్నో ఏళ్ల పోరాట ఫలితం

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 13 : ఎస్సీ వర్గీకరణ అమలు ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్ మాదిగ అన్నారు. పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రకమన్నారు. ఆ తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఎస్సీ వర్గీకరణ అమలుపరుస్తామని గతంలో ప్రకటించారని, ఆ హామీని నిలబెట్టుకుంటారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం రాము, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు టైగర్ వన్నూరుస్వామి, నాయకులు గోవిందు, సురేష్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 13: మండలంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన సురేష్‌పై ఇదే కాలనీకి చెందిన నవీన్, గంగధర, నాగరాజులతో పాటు మరికొంతమంది కట్టెలతో దాడిచేసి గాయపరిచారని రూరల్ పోలీసులు తెలిపారు. వినాయక నిమజ్జనం రోజున నవీన్, సురేష్ సెల్‌ఫోన్ విషయంలో గొడవపడ్డారు. దీన్ని మనసులో పెట్టుకున్న నవీన్ మరోసారి శుక్రవారం సురేష్‌తో గొడవపడ్డాడు. దీంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. గాయపడ్డ సురేష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మేకలు మృతి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 13: మండలంలోని చదంగొల్లల దొడ్డి గ్రామంలో శుక్రవారం 13 మేకలు ఒక్కసారిగా మృతి చెందినట్లు వాటి యజమాని పూజారి ఆంజనేయ తెలిపారు. తనకున్న 65 మేకలను మేపేందుకు రోజువారిగానే అడవికి తీసుకెళ్లానని, సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో రోడ్డుపై పడేసిన టమోటాలను పలు మేకలు తిన్నాయని, ఆ వెంటనే 13 మేకలు తీవ్ర అస్వస్థతకు గురై అక్కడిక్కడే మృతి చెందాయని వాపోయారు. చదం గ్రామానికి పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించారు. విషపునీరు తాగాయా లేదా టమోటాలు తిని మృతి చెందాయా అనే విషయం పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలాల్సి ఉందన్నారు. దీంతో దాదాపు రూ. 1.50 లక్షలు నష్టం వాటినట్లు యజమాని విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయండి

గ్రామసభల్లో ఎమ్మెల్యేకు గ్రామస్థుల వినతి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 13: మండలంలోని ఆలూరు, బోడాయిపల్లి, వెలమకూరు గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా సీసీరోడ్లు, డ్రైయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే సమస్యలు తీర్చాలని కోరారు. అలాగే ఉపాధిహామీ పనిదినాలు 200రోజులకు పెంచడంతోపాటు కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలని విన్నవించారు. ఆలూరు గ్రామసభలో తమ భూములను కొందరు ఆక్రమించుకున్నారని పలువురు గ్రామస్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమించుకున్న భూముల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. ఉపాధిహామీ పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఆదినారాయణమ్మను ఆదేశించారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రామసభల్లో ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్డీ జిలాన్‌బాషా, ఎంఈఓ నాగరాజు, సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, టీడీపీ నాయకులు కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం


కళ్యాణదుర్గంలో పోస్టర్లను విడుదల చేస్తున్న టీడీపీ నాయకుడు ధర్మతేజ, మున్సిపల్ కమిషనర్

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 13 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, టీడీపీ నాయకుడు ధర్మతేజ సూచించారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనం కూడా ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్కడ పడితే అక్కడచెత్తా చెదారం వేయకుండా మున్సిపాలిటీ సిబ్బంది ఏర్పాటుచేసిన చెత్త కుండీల్లోనే వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. తర్వాత స్వచ్ఛతాహి సేవ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపీ రమేష్, మాజీ వైస్ ఛైర్మన్ గౌని శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వారు స్వచ్ఛ రాయదుర్గం, స్వచ్ఛతాహి సేవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవలో భాగంగా పారిశుధ్యం నిర్వహణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, కౌన్సిలర్ గౌని లావణ్య, కో ఆప్షన్ మెంబర్ నజీర్, వార్డు ఇన్‌చార్జిలు పొరాళు శివ, పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: గ్రామాలను సంపూర్ణ స్వచ్ఛతగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనరసింహ తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఈ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛతపై పురోగతి తీసుకు రావడానికి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, తిప్పేస్వామి, మండల విద్యాశాఖాధికారి తిప్పేస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దీపిక, వివిధ గ్రామాలు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 13 : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని మల్లాపురం గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. మాంసకృతులు, ప్రోటీన్లు, పిండి పదార్థాలు, విటమిన్లు ఉన్న ఆహారం తీసుకోవాలని తెలిపారు. దీనివల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్రీడమ్ కోఆర్డినేటర్ రామ్మోహన్, సూపర్‌వైజర్ అరుణ, బీపీసీ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


బాలాజీ ఆచారి (ఫైల్)

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 13: కంబదూరు మండలం అండేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన బాలాజీ ఆచారి (35)కి బెళుగుప్ప మండలం యలగలవంక గ్రామానికి చెందిన శ్వేతతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమారులు పునీత్ సాయి, హర్షవర్ధన్ ఉన్నారు. బాలాజీ ఆచారి తిమ్మాపురం వద్ద ఉన్న గాలిమరలలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. మార్గంమధ్యలోని అండేపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల వెలుతురుకు రోడ్డు కనిపించక పక్కనే ఉన్న గుంతలోని ముళ్లపొదల్లోకి దూసుకెళ్లాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి రక్షించేలోగానే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కంబదూరు పోలీసులు ఘటనాస్థలికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని కూలీ..


మృతిచెందిన గంగయ్య

తాడిపత్రి: మండలంలోని ఇగుడూరు గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగయ్య (40) మండలంలోని చుక్కలూరు గ్రామం వద్ద ఉన్న బొగ్గులబట్టీలో కూలి పని చేస్తుండేవాడు. అయితే పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ఇగుడూరుకు వెళుతుండగా వాహనం మరమ్మతుకు గురికావడంతో దానిని రోడ్డు పక్కన ఆపేసి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సీఐ చెప్పారు.

రెగ్యులర్ చేయాలని నిరసన



తాడిపత్రి, కళ్యాణదుర్గంలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది

తాడిపత్రి, సెప్టెంబరు13: తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసే వైద్యసిబ్బంది శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది సావిత్రమ్మ, విమల, సుజాత తదితరులు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించామన్నారు. కానీ 115 జీవో ద్వారా ఏఎన్‌ఎంలను స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు అని చెప్పి జీఎన్‌ఎం రెగ్యులర్ స్టాఫ్‌గా నియమించారన్నారు. తమ సర్వీసును కూడా గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్ట్ విధానంలో పనిచేసే చాలామందికి వయోపరిమితి దాటిపోతోందని తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలో పనిచేసే ప్రతి ఒక్కరిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్ : జీవో నెంబర్ 115ను రద్దు చేయాలని కాంట్రాక్ట్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ నర్సులను పారామెడికల్ సిబ్బంది రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ నర్సులు స్వప్న, శ్యామల, మునిరత్నమ్మ, అంబికా జ్యోతి, సువర్ణ, గంగమ్మ, ఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.